ప్రజాశక్తి
www.prajasakti.com
I

కాలుష్య రహిత మహానగరమే లక్ష్యం

- ఆ దిశగా పూర్తిస్థాయి ప్రక్షాళన
- నెలకు మూడు రోజులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- ప్రతీ పదిరోజులకు గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్
- కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ ఉన్నతాధికారులతోసిఎంసమీక్ష నిర్వహించారు. తెలంగాన రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటీవల గ్లోబల్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ఏరియాను ప్రణాళిక బద్ధంగాఅభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని, పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని సీఎం తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని, హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన చెత్త నిర్వహణ సమస్యను సమర్థవంతంగా అధిగమించాలన్నారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని, సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఇవి బస్సులు, ఆటోలను తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త జోనల్ కమిషనర్లకు సిఎం దిశానిర్దేశం చేశారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్ లో ఉండాల్సిందేనని, జోన్ ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్ లదేనని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడా, రోడ్లపై గుంతలు కనిపించకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి

గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలనుఅందించేదిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్ మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సుపరిపాలనతో పాటు స్మార్ట్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. హైడ్రా, జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను బాధ్యత స్పెషల్ సీఎస్ సమన్వయం చేసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్లకు సిఎం సూచించారు.

ప్రతీ నెలకు ఒకసారి స్వయంగా సమీక్ష

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని హొటల్స్ లో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. క్యూర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకుఅందుబాటులో ఉన్న స్థలాన్ని కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు కార్యాలయాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని 12 జోన్లలో చెరువులు, కుంటలు, నాలాలను పూర్తిగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆక్రమణలను తొలగించి వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద చెరువులను గుర్తించి వాటిని పునరుద్ధరించి యాక్టివిటీ జోన్స్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. జనవరి నుంచి ప్రతీ ఒక్కరూ ఫీల్డ్ ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే నగరం భవిష్యత్ మారుతుందన్నారు. ప్రతీ నెలకు ఒకసారి జోనల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ జయేశ్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రెటరీ మాణిక్ రాజ్, జిహెచ్ఎంసి కర్ణన్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండి అశోక్ రెడ్డి, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్ సి డిఎ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బిసి- ఎలో చేర్చాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముదిరాజ్‌లను బిసి-ఎలో చేర్చాలని, అందుకు తన మంత్రి పదవిని త్యాగం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ముదిరాజ్‌ల ఐక్యతను చాటేందుకు పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమైనదన్నారు. ప్రజాప్రతినిధులలో సర్పంచులకు మాత్రమే రాజ్యాంగం చెక్కు పవర్ కల్పించిందని చెప్పారు. సర్పంచులందరూ భవిష్యత్‌లో ఎమ్మెల్యేలుగా, ఎంపిలుగా గెలిచేలా బాగా పని చేయాలని సూచించారు. పండుగ సాయన్న, కానిస్టేబుల్ కృష్ణయ్య ఉద్యమ స్ఫూర్తితో, మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచన విధానంతో, అంబేద్కర్ ఇచ్చిన వాటాతో రాజకీయంగా ముదిరాజ్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజులు ఎక్కువగా ఉన్నారని, అందుకు అనుగుణంగా అసెంబ్లీలో, పార్లమెంటులో ప్రాతినిథ్యం పెరగాలని అన్నారు. ఒకవైపు బీసీ బిడ్డగా, మంత్రిగా అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతూనే తన జాతి అభ్యున్నతి కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎంపి సర్పంచ్‌గా అందరికీ అవకాశం రాదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని నూతన సర్పంచులకు సూచించారు.

కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి

మతోన్మాద రాజకీయాన్ని తిప్పికొట్టాలి : జాన్‌వెస్లీ

స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాలతో ప్రజా పోరాటాలు రూపొందిస్తాం : నున్నా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ అవలంబిస్తున్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా సిపిఎం కార్యకర్తలు సమశీల పోరాటాలకు సిద్ధం కావాలని, రాబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ అధ్యక్షతన జరిగిన పార్టీ పాలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ నుంచి గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పోటీ చేసిన అభ్యర్థులను జాన్‌వెస్లీ సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతోందని, మరోపక్క మతోన్మాద రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఆర్థిక భారాలు మోయలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కానీ, బిజెపి మతోన్మాద రాజకీయాలతో ప్రజాసమస్యల నుంచి దృష్టి మళ్లిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను సైద్ధాంతికంగా ఎదుర్కోవడానికి, ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని, హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. త్వరలో జరగనున్న కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో సిపిఎం బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

పాలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పాలేరు డివిజన్ వ్యాప్తంగా ఎనిమిది సర్పంచులు, ఏడు ఉప సర్పంచ్, 100కు పైగా వార్డులు స్థానాలు గెలుచుకున్నామని వివరించారు. ప్రలోభాలకు తలొగ్గకుండా పోరాడిన అభ్యర్థులకు, ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నాయకులందరూ ఆ పదవిని ప్రజల కోసం ఉపయోగించాలని సూచించారు. మంచి పరిపాలనందించి సిపిఎం వారసత్వాన్ని, గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారి వారసత్వాన్ని పెంచాలని చెప్పారు. ఈ స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో మరిన్ని స్థానాలను గెలుచుకునేందుకు కార్యకర్తలు, నాయకులు నిరంతరం కృషి చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, ఎర్ర శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి బండి రమేష్, నాయకులు కొమ్ము శ్రీను, నంద్ర ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, మల్లెల సనుమంతరావు, కె.వి.రెడ్డి, దాసరి మహేందర్, పుల్లూరి నాగేశ్వరరావు, పద్మనాభుల సుధాకర్, బింగి రమేష్, వెంకన్న, తెగినాటి మంగ తాయారు, సుగుణమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలోనూ తెలంగాణకు అన్యాయం

- నీటి వాటాల సాధనలో రేవంత్‌రెడ్డి కెసిఆర్ బోధ్యు
- రౌండ్ టేబుల్ సమావేశంలోజస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా నీటి వాటాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో “తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటా పొందడంలో విఫలం-కారణాలు” అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. నీళు నిధులు, నియామకాల లక్ష్యంగా ఏర్పడ్డ తెలంగాణ పన్నెండేండ్ల స్వరాష్ట్ర పాలనలో అన్నింటా అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, లంచాలకు మరిగి తెలంగాణ సొమ్మును కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని జస్టిస్ పినాకిని ఘోష్ కమిటీ నివేదిక ఇచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా కేసును సిబిఐకి అప్పగించారని ఆరోపించారు. మెఘా కృష్ణారెడ్డికి మేలు చేసేందుకే కేంద్రానికి అప్పగించారని ఆరోపించారు. స్వరాష్ట్ర ఏర్పడ్డ తర్వాత కెసిఆర్, రేవంత్‌రెడ్డిలు తమ స్వప్రయోజనాల కోసమే పాటు పడ్డారని విమర్శించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంలో ఇద్దరు దోషులేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఇంజినీర్స్ ఫోరం కన్వీనర్ దొంతుల లక్ష్మీనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి వరకు నీటి వాటాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. “కృష్ణా నది తెలంగాణలో 70 శాతం, ఎపిలో 30 శాతం ప్రవహిస్తోంది. 70 ఏళ్లుగా తెలంగాణ ప్రాంతానికి కృష్ణా జలాల పంపిణీలో అన్యాయం జరుగుతోంది. నది పరివాహకాన్ని పరిగణంలోకి తీసుకోకుండా బచావత్ ట్రిబ్యూనల్ ఎపికి 512 టిఎంఎసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు కేటాయించారు” అని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడి పన్నెండేండ్లు గడుస్తున్నా తెలంగాణకు జరుగుతున్న అన్నాయాన్ని సరిదిద్దడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కృష్ణా బేసిన్‌పై ఆధారపడ్డ మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన పాలమూరు-రంగారెడ్డి, కోయిల సాగర్, నెట్టెంపాడు, భీమా డిండీ, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత సర్కార్ చెబుతున్నట్టు పాలమూరు-రంగారెడ్డికి సంబంధించి 90 శాతం పనులు కాలేదని, రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టి, 36 శాతం పనులు మాత్రమే చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకే రూ.35 వేల కోట్ల అంచనాతో చేపట్టిన ప్రాజెక్ట్‌ను రూ.65 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు రాఘవాచారి, నైనాల గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

- విద్యార్థి అమరుల స్ఫూర్తిని కొనసాగిద్దాం..
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రజనీకాంత్, నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థి అమరుల స్ఫూర్తితో విద్యారంగాన్ని కాపాడుకుందామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రజనీకాంత్, నాగరాజు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ముందు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెండా ఆవిష్కరణ చేశారు. ఒయు రీసెర్చ్ స్కాలర్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాలతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ 56 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యారంగాన్ని ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ నుంచి రక్షించేందుకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందన్నారు. దేశం సంపదనను దోచిపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ.. విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకునేందుకు నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం ఎస్ఎఫ్ఐ చేస్తోందని, అందుకే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడ చూసినా ఎస్ఎఫ్ఐ అనే మూడు అక్షరాల జెండా రెపరెపలాడుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా ప్రయి వేటుకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందని, దీని వల్ల ప్రభుత్వ విద్య వ్యవస్థ నిర్వీర్యమ వుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ విశ్వవిద్యాలయాలకు రెడ్ కార్పెట్ పరచడం ద్వారా దేశ విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపా ధ్యక్షులు మాట్లాడుతూ.. విద్యారంగం ప్రయివేటు కార్పొరేట్ శక్తుల ఆధీనంలోనే ఉందని, విద్యాశాఖ మంత్రి లేకుండానే రాష్ట్ర విద్యా వ్యవస్థ నడుస్తోందని అన్నారు. విద్యారంగ భవిష్యత్ ప్రమాదంలో పడుతున్న ఈ సమయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణలో విద్యార్థులు భాగస్వాములై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్, ఓయూ ఉపాధ్యక్షులు కిరణ్, సహాయ కార్యదర్శి మనోజ్, యూనివర్సిటీ నాయకులు తరుణ్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నష్టాల ఊబిలో కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ

- ప్రభుత్వం ఆదుకోకుంటే మనుగడ ప్రశ్నార్థకం
- 4 లక్షల టన్నుల నుంచి 21,000 పడిపోయిన క్రషింగ్
- వరి, పామాయిల్ పంటలపైనే రైతుల దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకప్పుడు ఖమ్మం జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో సాగైన చెరుకు, ప్రస్తుతం కేవలం 754 ఎకరాలకు పడిపోయింది. సరైన ప్రోత్సాహకం, ధరలు లేకపోవడంతో రైతులు ఇతర పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. గత కొన్నేండ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. నాలుగు లక్షల టన్నుల వరకు క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్న కల్లూరు మండలంలోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ, 2025-26 సీజన్‌లో కేవలం 21,500 టన్నుల చెరుకు క్రషింగ్ చేసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆరు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. అందులో ప్రధానమైనది నిజామాబాద్ జిల్లా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ. ఆ తర్వాత జగిత్యాలలోని ముత్యంపేట, మెదక్‌లోని ముంబోజిపల్లిలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. మిగతావి ప్రయివేటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ రోజుకు 3,200 టన్నుల చెరుకు క్రషింగ్ చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఫ్యాక్టరీ ప్రారంభ దశలో చెరుకు సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపేవారు. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీసుకునే అవకాశం ఉండటం, చెరుకు దిగుబడులు అధికంగా రావడం వల్ల రైతులు ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందేవారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం పేరువంచ గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ ఏర్పడింది. దాంతో చుట్టుపక్కల మండలాలతోపాటు అశ్వరావుపేట, భద్రాచలం, తల్లాడ, వైరా, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో చెరుకు సాగు విస్తరించింది. సుమారు 20 వేల ఎకరాల్లో చెరుకు సాగు జరిగేది. ఫలితంగా ఫ్యాక్టరీ ప్రారంభించిన రెండు-మూడు సంవత్సరాల్లోనే సుమారు నాలుగు లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ జరిగేది. ఫ్యాక్టరీ సుమారు మూడు నుంచి నాలుగు నెలలపాటు నిరంతరంగా నడిచేది. దీంతో ప్రత్యక్షంగా-పరోక్షంగా సీజనల్ కార్మికులకు ఉపాధి లభించేది.

చెరుకు సాగు ఇలా తగ్గింది

సాగునీటి సమస్యలు, కోతుల బెడద, పెరిగిన పెట్టుబడులు, తగిన మద్దతు ధర లేకపోవడం వల్ల చెరుకు సాగు లాభదాయకంగా లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం టన్ను చెరుకు ధర సబ్సిడీతో కలిపి సుమారు రూ.3,500 మాత్రమే ఉండగా, సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయని అంటున్నారు. వరి పంటకు బోనస్, పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందడంతో ఆ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

చెరుకు సాగు లాభాలు

ఇతర పంటలతో పోలిస్తే చెరుకు సాగుకు స్పష్టమైన లాభాలు ఉన్నాయి. ఒకసారి నాటితే మూడు పంటలు (మూల చెరుకు, మొదటి రాటూన్, రెండో రాటూన్) తీసుకునే అవకాశం ఉండటంతో, ఎకరానికి ఏడాదికి సగటున రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. అలాగే, చెరుకు ధర ఫ్యాక్టరీ నిర్ణయంతో స్థిరంగా ఉండటం వల్ల వరి, మిర్చి, పత్తి, పామాయిల్ వంటి పంటల మాదిరిగా ధరల హెచ్చుతగ్గులు ఉండవని రైతులు చెబుతున్నారు.

ఆటుపోట్లు తట్టుకునే చెరుకు సాగు

పంటల సాగు, ధరల్లో వచ్చే ఆటుపోట్లను తట్టుకోవాలంటే చెరుకు సాగు ఉపయోగకరంగా ఉంది. ధరలో ఎలాంటి హెచ్చుతగ్గులూ ఉండవు కాబట్టి రైతుకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. ఫ్యాక్టరీ నిర్ణయించిన ధరకు తగ్గించకుండా నిలకడగా ఉంటుందని కొంత చెరుకు సాగు చేస్తే.. ఇటు ఫ్యాక్టరీ అటు రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. చెరుకు సాగు వల్ల రైతుకు ఆర్థిక స్థిరత్వం లభించడంతో పాటు, ఫ్యాక్టరీ నిరంతరం నడవడంతో ప్రత్యక్షంగా-పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర పెంపు, చెరుకు సాగుకు బోనస్, సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్, యాంత్రీకరణకు ప్రోత్సాహం వంటి చర్యలు చేపడితే రైతులు మళ్లీ చెరుకు సాగు వైపు దృష్టి సారించే అవకాశం ఉంది. లేకపోతే మూతపడిన ఫ్యాక్టరీల పరిస్థితి లాగానే కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ మారే ప్రమాదం ఉంది. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెలిపిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఆశలు కల్పించింది. దాని ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక అందించినా ముందుకు సాగడం లేదు. ఉన్న ఫ్యాక్టరీలను అయినా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

నేడు అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు

- న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో సర్వీసులు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం డిసెంబర్ 31వ తేదీ బుధవారం హైదరాబాద్ మెట్రో రైలు సర్వీసుల సమయం పొడిగించినట్టు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. సాధారణంగా రోజూ రాత్రి 11 గంటల వరకు మాత్రమే నడిచే మెట్రో రైళ్లు, నూతన సంవత్సరం సందర్భంగా అదనపు సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. రాత్రి చివరి మెట్రో రైళ్లు అన్ని ప్రారంభ స్టేషన్ల నుంచి అర్ధరాత్రి ఒంటి గంటకు బయలుదేరనున్నాయని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా మెట్రో రైళ్లు, స్టేషన్లలో అదనపు సిబ్బంది, పోలీసు బలగాలను మోహరించనున్నట్టు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను జరుపుకునే ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుని సురక్షితంగా ప్రయాణించాలని, నిబంధనలను పాటించాలని సూచించారు.

యూరియాపై ఆందోళన వద్దు

- అందుబాటులో 47.68 లక్షల సంచుల నిల్వ
- కలెక్టర్ల పర్యవేక్షణలో సరఫరా : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన మేరకు యూరియా సరఫరా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీనిచ్చారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలను, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. ప్రత్యేక అధికారులు జిల్లాల వారీగా యూరియా సరఫరాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రబీ సీజన్‌కు గానూ అక్టోబర్ నుంచి మార్చి వరకు కేంద్రం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్టు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 47.68 లక్షల సంచులు (2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు) అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలని సూచించారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కనీసం పది పనిదినాల పాటు సభ నిర్వహించండి

- ఎజెండాను ముందురోజు సాయంత్రం లోపే ఇవ్వాలి
- ఏటా 50 రోజులు సభ నడిచేలా ప్లాన్ చేయండి
- స్పీకర్‌కు సిపిఐ పక్ష నేత కూనంనేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను కనీసం పది పనిదినాల పాటు నిర్వహించాలనీ, ఏటా కనీసం 50 రోజుల పాటు సభ నిర్వహించేలా ప్లాన్ చేయాలని శాసనసభ స్పీకర్, బిఎసి చైర్మన్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సిపిఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు లేఖ రాశారు. సభకు సంబంధించిన అజెండాను ముందు రోజు రాత్రి, అర్ధరాత్రి ఇవ్వడం సరిగాదనీ, సాయంత్రం లోపే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పుడే సభ్యులకు చర్చకు వచ్చే అంశంపై సమగ్రంగా ప్రిపేర్ అయ్యి వచ్చే వీలు ఉంటుందని తెలిపారు. శాసనసభకు సంబంధించి అన్ని కమిటీ నియామకాలను పూర్తి చేయాలని కోరారు. పార్లమెంటు తరహాలో మినీ పార్లమెంటుగా పిలవబడే స్థాయీ సంఘాల(స్టాండింగ్ కమిటీల) ఏర్పాటుకు చొరవ చూపాలని విన్నవించారు. ఈ సమావేశాల్లో మహాత్మాగాంధీ నరేగా పునరుద్ధరణ, రాష్ట్రాలపై భారాలు మోపే జి ఆర్ఎఎం జి చట్టాన్ని ఉపసంహరణకు చర్చించి తీర్మానం చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల అమలు నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ కేంద్రానికి తీర్మానాన్ని పంపాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీలో వంద శాతం ఎఫ్‌డిఐలకు అనుమతిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కూడా వ్యతిరేకిస్తూ సభలో తీర్మానం చేయాలని కోరారు. నదీజలాలు, ప్రాజెక్టుల స్థితిగతులపై సమగ్ర చర్చకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతో పాటు ఏజెన్సీలను రద్దు చేసి ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా జీతాలివ్వాలనే అంశాలపై తీర్మానాలు చేయాలని కోరారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం, సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటన, సింగరేణి కార్మికుల సమస్యలు, ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశాలపై సభలో లోతుగా చర్చ జరిగే అవకాశం కల్పించాలని విన్నవించారు.

హరీశ్‌రావు చెప్పేవన్నీ అబద్ధాలే

- బనకచర్లను అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పేవన్ని అబద్ధాలేనని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పోలవరం-బనకచర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. ప్రాజెక్ట్‌ను ఆపాలని కేంద్రంపై వివిధ రకాలుగా ఒత్తిడి తెస్తూనే సుప్రీంకోర్టులో కేసు వేశామని అన్నారు. (కేస్ నెంబర్ 1,258) జనవరి 5న విచారణకు వస్తుందని మంత్రి పేర్కొన్నారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల మళ్లింపుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతిచ్చిందని హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. జలశక్తి మంత్రిత్వశాఖ పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతి నిలిపివేయడమే కాకుండా డీపీఆర్ సిద్ధం చేయడానికి కూడా నిరాకరించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి వాటాలను పదేండ్లలో బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని ఉత్తమ్ ఆరోపించారు. వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ పార్టీ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

పేపరు ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో

HMOP 232/2025

బిట్వీన్:

గడిపూడి వెంకటేష్ .... పిటిషనరు

Vs

నల్లపాటి శ్రావ్య ... రెస్పాండెంటు

టు:

నల్లపాటి శ్రావ్య W/o గడిపూడి వెంకటేష్, ప్రైవేటు ఉద్యోగి, C/o నల్లపాటి శ్రీనివాసరావు, ప్లాట్ నెం:20, అరోరా PG కాలేజ్ దగ్గర, భాగ్యనగర్ కాలని పీర్జాదిగూడ, ఘట్ కేసర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

ఇందలి పిటీషనరు మీపై విడాకులు కోరుచూ పిటీషన్ దాఖలు చేసుకొనగా మీకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా నోటీసు పంపించినను కావాలని తీసుకొనక నా క్లయింట్‌ను నష్టపరుచు దురుద్దేశముతో కాలయాపన చేయుచున్నందున చివరి సారిగా మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా ది: 09-01-2026 వ తేదికి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదా రోజున మీరు స్వయంగా కానీ లేదా అడ్వకేటు గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్ష మందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 09/01/2026 ఇట్లు

మేదరమెట్ల నాగేశ్వరరావు
పిటీషనరు తరుపు అడ్వకేట్
నరసరావుపేట.

సంక్రాంతికి కొత్త రైళ్లు

- పండగ నేపథ్యంలో ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్ : సంక్రాంతి పండగ నేపథ్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే అదనపు రైళ్లను ప్రకటించింది. మంగళవారం ఎస్‌సిఆర్ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా మరో 11 ట్రైన్లను నడపనున్నట్లు తెలిపింది. జనవరి 7 నుంచి 12వ తేదీ మధ్య పార్వతీపురం-కాకినాడ టౌన్, కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ టౌన్-వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఆయా రైళ్లలో 1 ఎసి, 2 ఎసి, 3ఎసి, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆయా రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని పేర్కొంది.

హైకన్విక్షన్ వెల్త్ హబ్‌గా హైదరాబాద్

- ఎంకె వెల్త్ మేనేజ్‌మెంట్ అంచనా

హైదరాబాద్ : భారతదేశంలో వేగంగా ఎదుగుతున్న అధిక సంపద కేంద్రంగా హైదరాబాద్ అవతరిస్తోందని ఎంకె గ్లోబల్ ఫైనాన్సీయల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు చెందిన ఎంకె వెల్త్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జిసిసి) ఆధారంగా బలపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేగంగా విస్తరిస్తున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ ఈ పరిణామానికి ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయని ఎంకె వెల్త్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ వైష్ తెలిపారు. ఈ నిర్మాణాత్మక ధోరణులు హైదరాబాద్‌ను దీర్ఘకాలిక సంపద సృష్టికి కీలక మార్కెట్‌గా నిలబెడుతున్నాయన్నారు. ఈక్విటీలు, ప్రయివేటు మార్కెట్లు, రియల్ అసెట్స్, ప్రత్యామ్నాయ పెట్టుబడుల్లో విస్తృత అవకాశాలు అందిస్తాయన్నారు.

బిఆర్ఎస్ఎల్‌పి ఉప నేతలుగా హరీశ్‌రావు, తలసాని, సబితా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసన సభలో భారత రాష్ట్ర సమితి శాసనసభాపక్ష (బిఆర్ఎస్ఎల్‌పి) ఉప నేతలు (డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు)గా మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పటోల్ల సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కెసిఆర్) నియమించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2023, డిసెంబర్ ఏడో తేదీన అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు బిఆర్ఎస్ఎల్‌పి నేతగా కెసిఆర్ మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేతలను నియమించారు. శాసన మండలిలో బిఆర్ఎస్ శాసనమండలిపక్ష ఉప నేతలు (డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు)గా మాజీ మంత్రి ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని నియమించామని తెలిపారు. మండలిలో బిఆర్ఎస్ విప్‌గా దేశపతి శ్రీనివాస్ ఉంటారని పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన బండెల నర్సింహా కూతురు హంసలేఖ (22) బ్రిలియంట్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. మంగళవారం స్నేహితులతో కలిసి మౌంట్ ఓపెరా నుంచి పల్సర్ బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ వైపు వెళ్తుండగా సింగరేణి కాలనీ వద్ద ఎదురుగా వచ్చిన యాక్టివా టూ వీలర్ వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వారు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ఘట్‌కేసర్ వెళ్తున్న లారీ (బాటసింగారం ఫ్లై ఓవర్ వద్ద యూ-టర్న్ తీసుకోవడానికి వెళ్తూ) వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హంసలేఖ తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలైన అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు సుభిక్షం

- నేరాలు 2.33 శాతం తగ్గాయి
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎవ్వరినీ వదలం
- మావోయిస్టులు నిర్భీతిగా వచ్చి లొంగిపోవచ్చు
- నేరాలపై డిజిపి వార్షిక నివేదిక

2025 నేరాల వార్షిక నివేదికను విడుదల చేస్తున్న డిజిపి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది శాంతి భద్రతలు సుభిక్షంగా ఉన్నాయని రాష్ట్ర డిజిపి అన్నారు. " నేరాల సంఖ్య గతేడాది కంటే 2.33 శాతం తగ్గాయి. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎవ్వరినీ వదిలిపెట్టం. మావోయిస్టులు లొంగిపోవడానికి మా ద్వారాలు తెరిచే ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే రాష్ట్ర పోలీసులు ఫస్ట్. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరిగినా.. మరణాల సంఖ్య తగ్గింది" అని రాష్ట్ర డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో 2025 నేరాల వార్షిక నివేదికను డిజిపి విడుదల చేశారు.

కేసిఆర్ పేరెత్తకుండా...

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని కొందరు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రమూ నిజం లేదని, శాంతి భద్రతలను బేరీజు వేసే దొమ్మీ కేసులు గతేడాది కంటే గణనీయంగా తగ్గడమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా ముగియడం కూడా దీనికి ఒక నిదర్శనమని ఆయన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ పేరెత్తకుండా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఈ ఏడాది నిర్వహించిన ప్రతిష్టాకరమైన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సవ్యంగా జరిగాయని అన్నారు. ముఖ్యంగా గ్లోబల్ సమ్మిట్, మిస్‌వరల్డ్ పోటీలతోపాటు మరికొన్ని కార్యక్రమాలు రాష్ట్ర పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేశాయని ఆయన చెప్పారు. ముఖ్యమైన పండుగలు, పర్వదినాల సందర్భంగా ఎలాంటి మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా సాగేలా చూశామని వివరించారు.

కేసుల తగ్గుదల 2.33 శాతం

రాష్ట్రంలో గతేడాది 2,34,158 కేసులు నమోదు కాగా ఈ ఏడాది అది 2.33 శాతం తగ్గి 2,28,695కు చేరుకున్నదనీ, ఇది రాష్ట్ర పోలీసులు సమిష్టిగా నిర్వహించిన విధుల కారణంగానే సాధ్యమైందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు లొంగిపోయారనీ, అందులో 24 మంది మాత్రమే తెలుగువారని ఆయన చెప్పారు. అజ్ఞాతంలో రాష్ట్రానికి చెందిన 53 మంది మావోయిస్టులు ఉన్నారనీ, వారి లొంగుబాటుకు ద్వారాలు తెరిచే ఉంచామని ఆయన తెలిపారు.

సైబర్ రికవరీలో భేష్

గ్యాంగ్‌స్టర్ నయీముద్దీన్‌కు చెందిన భూములను ఆక్రమించుకున్నవారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి హైకోర్టును ఆశ్రయించామని ఒక ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో జ్యుడిషియల్ పరిధిలో ఉన్నందున తానేమీ మాట్లాడలేననీ, అయితే ఈ కేసులో ఎంతటివారినైనా వదిలిపెట్టబోమని ఆయన మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామనీ, అందుకు తగిన ప్రక్రియ ప్రభుత్వస్థాయిలో కొనసాగుతున్నదని శివధర్‌రెడ్డి చెప్పారు. సైబర్ నేరాలు ఈ ఏడాది కొద్దిమేర పెరిగాయనీ, వారు దోచుకున్న మొత్తం రూ.246.22 కోట్ల నుంచి రూ.159 కోట్లను రికవరీ చేసి 24,498 మంది బాధితులకు అందజేశామని తెలిపారు. అదే సమయంలో వివిధ రాష్ట్రాల్లో నక్కి ఉన్న 371 మంది సైబర్ నేరగాళ్లను తమ ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

మాదక పదార్థాల నిరోధంపై రాష్ట్ర ఈగల్ టీం ఉక్కుపాదం మోపుతున్నదనీ, గతేడాదితో పోలిస్తే 31 డ్రగ్స్ కేసులు పెరిగాయనీ, మరోవైపు గతేడాది రూ.139.69 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.172.93 కోట్ల మేర విలువైన మాదకపదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

మహిళల భద్రతపై...

మహిళల భద్రత కోసం రాష్ట్రంలో నడుస్తున్న 34 భరోసా కేంద్రాలకు మరో నాలుగు విభాగాను తెరిచామనీ, వీటి ద్వారా 3558 కేసులను దర్యాప్తు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే పోక్సోకు సంబంధించి 2579 కేసులు, లైంగికదాడులకు సంబంధించి 819 కేసులు దర్యాప్తు చేశామనీ, 81 కేసులలో నేరస్థులకు శిక్షలు సాధించామని డీజీపీ వివరించారు. అనాథ పిల్లల భద్రతపై పని చేసిన ఆపరేషన్ స్మైల్, ఆపరేసన్ ముస్కాన్ 12,396 మంది పిల్లలను రక్షించడం జరిగిందని తెలిపారు. ఎన్నారై భర్తల హింసకు సంబంధించి 72 పిటిషన్లు రాగా అందులో 37 పరిష్కారమయ్యాయనీ, 33 కేసుల్లో లుకౌట్ నోటీసులను నిందితుల కోసం జారీ చేశామని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రత కోసం 86 బృందాలు పని చేస్తున్నాయనీ, వీటి ద్వారా 10,36,378 మంది మహిళలను చైతన్యపర్చడం జరిగిందని ఆయన వివరించారు. ఈ ఏడాది 481 హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులను నమోదు చేసి, 1277 మంది నిందితులను అరెస్ట్ చేసి.. 929 మంది బాధితులను రక్షించడం జరిగిందని తెలిపారు. 23,315 మిస్సింగ్ కేసులు నమోదు కాగా.. 78 శాతం తప్పిపోయినవారి ఆచూకీ కనిపెట్టి బంధువులకు అప్పజెప్పడం జరిగిందని చెప్పారు. ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీలో ఈ ఏడాది 12,555 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్టమైన శిక్షణను ఇవ్వడం జరిగిందనీ, అందులో 112 మంది డీఎస్పీలు కూడా ఉన్నారని చెప్పారు. పోలీసు శాఖలోని అధికారులు, సిబ్బందికి విద్యార్హతలను పెంచడానికి గానూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామనీ, దీని ద్వారా 30వేల మంది అధికారులు, సిబ్బందికి విద్యార్హతలు పెరగడానికి దోహదపడుతున్నదని ఆయన తెలిపారు. అలాగే పోలీసుల సామర్థ్యం, పనితీరును మరింత పెంచడానికి జేఎన్‌టీయూహెచ్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లతో కూడా ఎంఓయూలు కుదుర్చుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా ఏర్పడ్డ వరదల్లో చిక్కుకున్న 2485 మంది బాధితులను రక్షించడం జరిగిందనీ, వీటితో పాటు మరికొన్ని ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాల్లో సైతం బాధితులను రక్షించడంలో రాష్ట్ర పోలీసులు కీలక పాత్ర వహించారని ఆయన తెలిపారు.

7.9 శాతం తగ్గిన రోడ్డు ప్రమాద మరణాలు

జాతీయ స్థాయిలో షామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ పీఎస్‌గా అవార్డు లభించిందనీ, అలాగే పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్, చోరీ అయిన ఫోన్‌ల రికవరీ, సైబర్ నేరాల కట్టడిలో జాతీయ స్థాయి అవార్డులను దక్కించుకోవడం జరిగిందని డీజీపీ చెప్పారు. రాష్ట్రంలో నేరస్థులకు గతేడాది కంటే 3.09 శాతం శిక్షల రేటును పెంచగలిగామనీ, వచ్చే ఏడాది ఆ రేటును పెంచడానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. ఈ ఏడాది నలుగురు నేరస్థులకు మరణ శిక్షలను, 320 మంది నేరస్థులకు యావజ్జీవ శిక్షలను న్యాయస్థానాల ద్వారా పొందామనీ, నేరం చేసిన ప్రతి ఒక్కరికీ శిక్షలు పడేలా చేయడమే తమ లక్ష్యంగా ఎంచుకున్నామని ఆయన చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో 28 కేసులకు సంబంధించి 53 మంది నేరస్థులకు యావజ్జీవ శిక్షలు పడేలా చేశామని తెలిపారు. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను 7.9 శాతం తగ్గించగలిగామనీ, అయితే గతేడాదితో పోలిస్తే 5.68 శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగాయని చెప్పారు.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది హత్యలు 8.76 శాతం, లైంగికదాడి కేసులు 13.45 శాతం, ఆస్తి కోసం హత్యలు 15.66 శాతం, దొమ్మీ కేసులు 42.59 శాతం తగ్గగా.. బందిపోటు దొంగతనాలు 24.14 శాతం, బెదిరించి దొంగతనాలు 0.54 శాతం, దొంగనోట్ల కేసులు వంద శాతం పెరిగాయని ఆయన వివరించారు. ఈ ఏడాది మహిళల హత్యలు 2.90 శాతం, మహిళలపై వేధింపులు 9.02 శాతం, వరకట్న మరణాలు 0.79 శాతం పెరిగాయని తెలిపారు. బెట్టింగ్ యాప్‌లకు బానిసై కొందరు పోలీసులు ఆత్మహత్యలు చేసుకోవడంపై సీరియస్‌గా దృష్టిని సారించామన్నారు.

పింఛన్లపై ఆరా..!

- ఫోరెన్సిక్ ఆడిట్‌కు ప్రభుత్వం సమాయత్తం
- ప్రతి పింఛన్‌దారుడి ఫేషియల్ రికగ్నిషన్ ప్రక్రియకు యోచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సామాజిక పింఛన్లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెన్షన్ దారులు మరణించినా వారి పేరిట ఇంకా పింఛన్లు వెళుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో కచ్చితమైన లెక్క తేల్చడానికి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు ప్రతీ పెన్షన్ లబ్ధిదారుడి ఫేషియల్ రికగ్నైజేషన్ (ముఖ గుర్తింపు) ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించాలన్న నిర్ణయం అమలుకు ఇది కీలకమని ప్రభుత్వం భావిస్తోంది.

పైలట్ ప్రాజెక్టులో షాకింగ్ విషయాలు

నిజమైన లబ్ధిదారులు కచ్చితంగా తేలిస్తేనే.. పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడానికి, మరింత మందికి విస్తరింప జేయడానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

నాలుగు జిల్లాల్లో చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో షాకింగ్ విషయాలు వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అనర్హుల ఏరివేతకు నిర్ణయం తీసుకుంది.

ఫోరెన్సిక్ ఆడిట్లో బోగస్ పెన్షనర్లు

ఫోరెన్సిక్ ఆడిట్‌లో బోగస్ పెన్షనర్ల పేర్లు బయటకు వస్తున్నాయి. నాలుగు జిల్లాలలో దాదాపు 20 వేల మంది పెన్షనర్ల వివరాలను ఫోరెన్సిక్ ఆడిట్లో భాగంగా పరిశీలించగా వీరిలో పది శాతం అంటే దాదాపు 2000 మంది అనర్హులుగా లెక్క తేలింది. అనర్హులలో చనిపోయిన వారి పేరుతో పెన్షన్లు పొందుతున్న వారు, 50 ఏళ్లు నిండకుండానే వృద్ధాప్య పెన్షన్లు తీసుకుంటున్న వారు ఉన్నారని తేల్చింది. వైకల్యం లేకున్నా నకిలీ పత్రాలతో

దివ్యాంగ పెన్షన్లు పొందుతున్న వారు అనేక మంది ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా 43 లక్షల మందికి పెన్షన్లు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 43 లక్షల మందికి చేయూత పెన్షన్లను అందిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు, ఎయిడ్స్ బాధితులకు, డయాలసిస్ రోగులకు కలిపి 20 వేలకు పైగా కొత్త పెన్షన్లను మంజూరు చేసింది. వృద్ధాప్య, వితంతు, నేతన్న, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు రూ. 2016 ఇస్తుంది.

పెంపునకు ముందు రికవరీ..!

దివ్యాంగులకు నెలకు రూ.4016, దీర్ఘకాలిక డయాలసిస్ బాధితులకు రూ.5000 నుండి పదివేల వరకు పెన్షన్లను అందిస్తున్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు సాధారణ పెన్షన్లను రూ.నాలుగు వేలు, దివ్యాంగుల పెన్షన్లను రూ.ఆరు వేలు పెంచవలసి ఉంది. అక్రమంగా పెన్షన్లు తీసుకున్న వారి నుంచి రికవరీ కూడా చేస్తారన్న చర్చ ప్రభుత్వవర్గాల్లో నడుస్తోంది. ఆడిట్ పూర్తి తర్వాతే పెన్షన్ల పెంపు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయిచినట్టు తెలిసింది.

3న అసెంబ్లీ ముట్టడి

- ఆటో సంఘాల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జనవరి మూడో తేదీన తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్లందరికీ ఆటో జెఎసి పిలుపునిచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆటో కార్మిక సంఘాల జెఎసి సమావేశం జరిగింది. అందులో బి.వెంకటేష్, అశోక్ (ఎఐటియుసి) పుప్పాల శ్రీకాంత్, కె.అజయ్ బాబు (సిఐటియు), మారయ్య రామకృష్ణ (బిఆర్‌టియు), ప్రవీణ్, లింగం గౌడ్ (టియుసిఐ), దయానంద్, రాజశేఖర్ రెడ్డి (ఐఎన్‌టీయూసీ), సత్తిరెడ్డి (టిఎడిఎస్), కొండారెడ్డి (టిఎన్‌టియుసి), గడ్డం శ్రీనివాస్ (గట్స్), జాగృతి యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనుకూలంగా ఉన్నామంటూనే ఇంతవరకు దాని గురించి ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. ఫ్రీ బస్సు పథకాన్ని అమల్లోకి తెచ్చి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందనీ, వారిని ఆదుకునే దానికోసం నష్ట పరిహారం ఇస్తామన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12,000 ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గడానికి కారణమైన రాపిడో బైక్స్ నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరితే దాని గురించి ఒక ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. రెండేండ్లు ఎదురుచూసినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతోనే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టామని ప్రకటించారు. దాని జయప్రదం కోసం బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

సిగాచి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ రాజ్ సిన్హా అరెస్ట్

- జ్యుడీషియల్ రిమాండుకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రియాక్టర్ పేలి 54 మంది కార్మికులు మృతి చెందిన సిగాచి పరిశ్రమ సిఇఒ అమిత్ రాజ్ సిన్హాను పటాన్ చెరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీన పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు సంభవించి 54 మంది కార్మికులు మరణించిన విషయం తెలిసిందే. అంతా సజీవ దహనమయ్యారు. వారిలో కొంత మంది ఆచూకీ నేటికి లభ్యం కాలేదు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు.. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరిగి దాదాపుగా కొన్ని నెలలు కావస్తున్నా.. నేటికి సిగాచి పరిశ్రమ సిఇఒ అమిత్ రాజ్ సిన్హాను అరెస్ట్ చేయకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమ యజమాన్యంపై పరిశ్రమలో సంభవించిన అగ్ని ప్రమాదం ఘటనపై సంగారెడ్డి జిల్లా బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెం.184/2025, దీఎూ సెక్షన్లు 105, 110, 118(1), 118(2) ప్రకారం కేసు నమోదు అయింది. అయినా యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేయకపోవడంతో ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాయి. మంత్రులు, ముఖ్యమంత్రిపై కూడా విమర్శలు రావడంతో ఎట్టకేలకు ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా ఈ నెల 27వ తేదీ శనివారం రాత్రి నిందితుడైన సిగాచి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమిత్ రాజ్ సిన్హాను అరెస్టు చేసి జుడీషియల్ రిమాండుకు తరలించినట్టు సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని ఈ సందర్భంగా ఎస్‌పి పేర్కొన్నారు.

సభలో మాట్లాడుతున్న జూలకంటి

బాధ్యతగా గ్రామాలను అభివృద్ధి చేయాలి

- సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు సన్మానం
- అభినందన సభలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను సన్మానించారు. అభినందన సభలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఖరీదుగా మారిన ఈ ఎన్నికలో సిపిఎం బలపర్చిన అభ్యర్థులుగా పోరాడి విజయం సాధించారని చెప్పారు. ఎన్ని ఒత్తిడిలొచ్చినా లొంగకుండా పార్టీ, ప్రజల పక్షాన నిలబడడం గొప్ప విషయమన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం వారికి అందుబాటులో ఉండి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఎర్రజెండా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులుగా చేయాలన్నారు. మంచి ప్రజాప్రతినిధులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, జాతంగి సైదులు, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డా.మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

- తొమ్మిది మందిని నియమించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి సీజన్‌లో యూరియా పంపిణీకి ప్రత్యేక అధికారులను వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి నియమించారు. అడిషనల్ డైరెక్టర్లు కె విజయ్ కుమార్, బి నర్సింహారావు, జెడిఎలు ఎస్ గీత, వి ఆశాకుమారి, వై సుచరిత, బి బాలు, ఎం శైలజ, డిడిఎలు ఎం చంద్రశేఖర్, ఎం కనక రాజులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ప్రత్యేక అధికారికి నాలుగైదు జిల్లాలను కేటాయించారు. జిల్లాల్లో యూరియా పంపిణి సక్రమంగా జరిగేలా వారు మానిటరింగ్ చేయనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద యూరియా యాప్ కొనసాగుతున్న ఐదు జిల్లాలో కాకుండా మిగతా జిల్లాలోనూ యూరియా సక్రమంగా పంపిణి చేసేలా చర్యలను వ్యవసాయ శాఖ తీసుకుంటున్నది. యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీగా పంపిణి చేసేలా ప్రత్యేక అధికారులు జిల్లాల్లో పర్యటించి మానిటరింగ్ చేయనున్నారు. యూరియా పంపిణి కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడకుండా ప్రత్యేక అధికారులు పర్యవేక్షించనున్నారు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందనీ, తప్పుడు ప్రచారాలను నమ్మి ఇప్పుడు అవసరం లేకున్నా వచ్చి లైన్లలో నిలబడవద్దని డాక్టర్ బి గోపి సూచించారు. ముందస్తుగా లైన్‌లో నిలబడి యూరియా తీసుకోవడం వల్ల అవసరమున్న రైతులు ఇబ్బంది పడే అవకాశముందని తెలిపారు.

గంగాజలం కోసం మెస్రం వంశీయుల పయనం

- మురాడి వద్ద సమావేశం
- సంప్రదాయ పద్ధతిలో పూజలు
- సెల్‌ఫోన్ వాడకం నిషేధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతరగా వెళుతున్న మెస్రం వంశీయులు

గిరిజనుల ఆరాధ్య దైవం.. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన రెండో అతిపెద్ద జాతర నాగోబా తోలిఘట్టం ప్రారంభమైంది. మెస్రం వంశీయులు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ మురాడి వద్దకు చేరుకుని సమావేశమయ్యారు. పటేల్ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు చిన్ను, ఖాటోడ (పూజారులు) కోసు, కోసేరావ్, మెస్రం శేఖర్ ఆధ్వర్యంలో గంగా జలం కోసం వెళ్లే దారులపై చర్చించారు.

ఆచార సంప్రదాయాలకు పెద్ద పీట..

ఈసారి గంగా జలం కోసం పయనించే మెస్రం వంశీయులు ఆచార సంప్రదాయాలను పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ వాడకూడదని, తెల్ల దోతీ మాత్రమే ధరించాలన్నారు. బడి పిల్లలను కుటుంబీకులు తమ వెంట తీసుకుని రాకూడదని తీర్మానించారు. సంప్రదాయ పూజల అనంతరం గంగా జలం కోసం వెళ్లే ఖటోడ గౌరీ గ్రామానికి చెందిన (పూజారి) హనుమంతరావు వీపునకు తెల్లటి బట్టతో కలశంను కట్టి సాగనంపారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ బయలుదేరి రాత్రి బస చేస్తారు. బుధవారం ఇంద్రవెల్లి మండలంలోని చిలాటిగూడలో బసచేసి, 2026 జనవరి ఒకటిన నార్నూర్ మండలంలోని మాన్యాపూర్‌లో బస చేస్తారు. 2న జైనూర్ మండలంలోని మామడలో బస చేసి, 3న జైనూర్ మండలంలోని డబోలిలో బస, 4న సిర్పూర్(యు) మండలంలోని ధనోరలో బస, 5న జన్నారం మండలంలోని ఇస్లాంపూర్‌లో బస, 6న దస్తురాబాద్ మండలంలోని నర్సింగపూర్, 7న హస్తినమడుగులోని గోదావరికి చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి పవిత్ర గంగాజలాన్ని సేకరిస్తారు. అదే రోజు గంగాజలంతో తిరుగు ముఖం పట్టి జైనూర్ మండలంలోని పిట్టగూడా కటోడ ఇంట్లో బస చేస్తారు. అనంతరం చివరి రోజున 14న ఇంద్రవెల్లి మండలం ఇంద్రదేవి వద్ద బస చేసి, అదే రోజు కేస్లాపూర్‌లో సంక్రాంతి రోజు చేరుకుంటారు. మొత్తం అటు ఏడు ఇటు ఏడు రోజులు సాగే ఈ ప్రయాణంలో ఒక వైపు 210 కిలోమీటర్ల చొప్పున నడక ఉంటుంది.

కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్‌లు

- మీడియా స్వేచ్ఛను నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం
- జర్నలిస్టులు పోరాడాలి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగించడం కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తెచ్చిందని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'లేబర్ కోడ్‌ల వల్ల మీడియా స్వేచ్ఛకు ప్రమాదమా'అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో మంగళవారం వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. ఇందులో వర్కింగ్ జర్నలిస్ట్స్ అండ్ అదర్ న్యూస్ పేపర్ ఎంప్లాయిస్ (కండిషన్స్ ఆఫ్ సర్వీస్) అండ్ మిస్‌లెనియస్ ప్రొవిజన్స్ ఆఫ్ యాక్ట్-1955, వర్కింగ్ జర్నలిస్ట్ (ఫిక్సేషన్ ఆఫ్ రేట్స్ ఆఫ్ వేజెస్) ఆఫ్ యాక్ట్-1958 చట్టాలను కూడా రద్దు చేసిందని వివరించారు. శాసన వ్యవస్థ, బ్యూరోక్రసీ, న్యాయవ్యవస్థ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని చెప్పారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉండే మీడియా ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తున్నదనీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాస్తవాలను ప్రచురిస్తున్నదనీ, ప్రసారం చేస్తున్నదని వివరించారు. ఇది మోడీ ప్రభుత్వానికి కంటగింపుగా మారిందన్నారు. అందుకే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ)ని కేంద్రం నిర్వీర్యం చేసిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారిని పీసీఐ చైర్మెన్‌గా నియమిస్తున్నదని అన్నారు. మీడియా స్వేచ్ఛను, భావ ప్రకటనా స్వేచ్ఛను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. వర్కింగ్ జర్నలిస్టులను నిర్వీర్యం చేసేందుకే పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిందని వివరించారు. పత్రికా స్వేచ్ఛ లేని దేశాల్లో ప్రజాస్వామ్యం లేదన్నారు. భారత్‌లోనూ పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికే ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు ఎలాంటి హక్కుల్లేకుండా చేసిందని అన్నారు. సాధారణ కార్మికులకు ఉండే హక్కులే వారికీ ఉండేలా చేసిందన్నారు. పథకం ప్రకారం ఫోర్త్ ఎస్టేట్‌ను నిర్వీర్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ప్రాతినిధ్యం లేకుండా 15వ ప్రెస్ కౌన్సిల్‌ను మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వాటివల్ల కార్పొరేట్ మీడియా సంస్థలకే ప్రయోజనం కలుగుతుందని వివరించారు.